# దిష్టిబొమ్మలు

- మావుడూరు సూర్యనారాయణమూర్తి

"ఏరా! ఇప్పుడా దుకానానికొచ్చేది? టైమెంతైందిరా!"

"ఓ అర్ధగంట లేటైంది సారూ! కోపం సెయ్యకు."

"ఇయ్యాల దుకానంలో ఎంత పని ఉందో యాదికి లేదేరా యాదగిరీ!"

"అది గాద్సార్! ఇయ్యాల మాయమ్మని హాస్పట్లకి దీస్కోని పోయొచ్చేసరికి ఆలస్యం అయింది!"

"ఏమైంది! మీ యమ్మకి!"

"ఏం బాగుండ్లేదు సారూ! చాలా కష్టపడుతోంది!"

"ఆమె యింట్లో కష్టపడ్తందనీ, నువ్వు వీధిలో కష్టపడక పోతే యెట్లా?"

"అందుకే గదా సార్... జర ఆలస్యంగానైనా... ఒచ్చేసినాను."

"సరె సర్లే... ఏమన్నడు డాక్టరూ?"

"టెస్టులు చేపించి మల్ల రేపు రమ్మన్నడు..."

"ఆ టెస్ట్లకి పైసలు మస్తుగయితాయి సార్."

***

యాదగిరి దీనంగా పైసల ముచ్చట దెచ్చేసరికి సారుకి రుచించలేదు. వినిపించుకో కుండా...

"ఆ సర్లే... పనంతా నీకోసం చూస్తోంది! తొందరగా పూర్తిచే సుకో..."

"అలాగే! సారూ! ఇయ్యాల ఎన్ని ఆర్డర్లున్నాయి సారూ!"

"ఓ చాలున్నాయి... మెటీరలంతా రడీ చేసా... నువ్వు రావేమోనని... పద... పద..."

"ఈ రోజు ఎన్ని తయారుగావాలి సారూ..."

"ఈరోజు ప్రతిపక్షాల ఊరేగింపులో చాలా హడా వుడి ఉంది!"

"ఒక ముఖ్యమంత్రి కావాలా సారూ!"

"నీకు తెలుసుగా! తొందరగా చేసేయ్! స్కాలర్‌షిప్‌ల గొడవటు... స్టూడెంట్సు యూనియన్ ధర్నా అంట... ఒక విద్యాశాఖామంత్రి కావాలట...

ప్రతీ దానికీ ప్రతిపక్షం వాళ్ళు అడ్డం పడుతున్నరని అధి కార పక్షం ధర్నా అంట; ప్రతిపక్ష నాయకుడు ఒకటి కావాల... కేంద్రంలో ప్రభుత్వం కూలిపోయేట్టుంది... అక్కడ ప్రతిపక్షాలు ఇక్కడ రేపు పెద్ద ఊరేగింపట...

"ఎందుకేనా మంచిది... ఒక ప్రధానమంత్రిని సిద్ధం చెయ్యి..."

"సరే! సార్! ఒక్క అరగంటలో వీళ్ళందరికీ ముఖాలు తగిలించేస్తా..." అంటూ సింథటిక్ హుషార్‌తో ఒక చిన్న చిరునవ్వును జనరేటు చేసుకుని లోనికి దొచ్చుకున్నాడు యాదగిరి.

***


యాదగిరి హుషారును చూసి "సారు" చాలా తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

తన వ్యాపారానికి యాదగిరి బుర్ర బంగారు బాతు. తాను డిగ్రీ చేసినా అది పాస్‌పోర్టుతో సంబంధం లేని డిగ్రీ కావడంవల్ల దానిని ఇక్కడే ఎలా వినియోగించుకోవాలో అని ఆలోచిస్తున్న ఆ మధ్యతరగతి బుర్రకి యాదగిరి గుడిసె నిజంగా గుడి లాగానే తారసపడింది.

ఆ గుడిసె ముందు యాదగిరి గడ్డిమేటు... వెదురు బొంగులు... అడిగిన వారికి కావల్సినవి చేసి పెట్టేవాడు. ఊర్లో ఎవరైనా చనిపోతే వారి అంతిమ యాత్రకు పచ్చబద్దల పల్లకీ యాద గిరి కార్ఖానా నుండి రెడీ!

ఏ వర్గం వారైనా ఏ నాయకుని మీదనైనా తమకున్న ఆక్రోశం వెళ్ళగక్కాలంటే యాదగిరి ఒక నమూనాను వాళ్ళకు సిద్ధంచేసేవాడు. ఏదో ఒక పనితో ఎప్పుడూ బిజీగా ఉండే యాదగిరి గుడిసె... పనికోసం వెదుకుతున్న మధ్యత రగతి విద్యావంతుడికి ప్రవాహంలో గడ్డిపరక.

"నువ్వెన్నాళ్ళీ గుడిసెలోనే ఉంటావు? మనిద్దరం కలిసి ఏదైనా చేద్దాం"



అన్నాడు.

***

తానొక్కడినే ఎన్నాళ్ళిలా... ఎదుగూబొదుగూ లేకుండా తల్లి కష్టంమీద ఆధారపడుతూ ఉండాలి. రేపు పెళ్ళయి తనొక యింటి వాడవ్వాలంటే ఈ గుడిసె సంపాదన చాలద నుకుని "ఏం చేద్దాం" అన్నాడు యాదగిరి.

అదుగో "ఏం చేద్దాం" అన్న ప్రశ్నకు వాళ్ళిద్దరూ కలిసి వెతికిన సమాధానమే ఈ దుకాణం. పని పాతదే! వాతావ రణం కొత్తది.

***

తాను చదివిన పొలిటికల్ సైన్సును ఇంత జాగ్రత్తగా తన వ్యాపారానికి అన్వయించుకొని నాలుగు కాసులు చేసుకు న్నాడు సారు. జీవితంలో కొంత కొత్త వెలుగు చూసేసరికీ "అదృష్టం" మీద నమ్మకం కలిగింది. మహదదృష్టం మీద యావ పెరిగి చేతికి రాళ్ళ ఉంగరాలు కూడా చేరాయి. యాదగిరికి మాత్రం ఇంకా ఆ యావ పెరగలేదు. ఎందు కంటే ఇంకా అతడికి "అదృష్టం" రుచే తెలియలేదు.

"యాదగిరీ! రెడీనా!" కస్టమర్ గొంతు ఖంగ్‌మని మ్రోగింది!

"ఆం... అయిపోయింది. మీకేది కావాలి."

"సీ. ఎమ్"

***

"ఒక్క అయిదు నిమిషాలు... కొంచెం గడ్డిపెట్టి ఫేస్‌కి ఫోటో పెట్టాలి! ఇదిగో.. అయిపోయింది... ఇచ్చేస్తా..." లోనుండి యాదగిరి గొంతు వినయంగా. "నీకు బలిసిం దిరో... గుడిసెలోనున్నపుడే బెటర్, అన్నం టైంకి ఇచ్చేవో డివి. గుడిసెకాడినించి దుకానంలోనికి ఒచ్చినావు... నీ లెవెల్ పెరిగిపోయింది."

"ఎందుకొర్లుతావే... ఇయ్యాల కొత్తగా ఒచ్చినట్లు? ఏ పార్టీతో పోతున్నరు మనోల్లంతా..." అంటూ చిరునవ్వుతో పలకరించాడు యాదగిరి.

"ఎటో ఒక దిక్కు పోవాలి గదన్నా! వస్తా... లారీలల్లో మనోల్లంతా కాసుక్కూచున్నారు" అని "సారు" చేతిలో పైసలు పెట్టి యాదగిరి ముఖాన చిరునవ్వు గుమ్మరించి పోయాడు.

ప్రతీ ధర్నాకి కావలసిన జనం తన బస్తీ నుండే వస్తారు. తన దుకానం నుండే అన్నీ తీసుకుపోతారు.

జనాలకు, పార్టీలవారికీ కావల్సినవి తయా రుచేయడంలో యాదగిరి క్రొత్త క్రొత్త ఆలోచ నలు చేస్తాడు. ప్రయోగాలు చేసి కస్టమర్సుని మెప్పిస్తాడు. సారుని ఒప్పిస్తాడు. ఫలితంగా సారు యాద గిరికి అప్పిస్తాడు.

***

నిజానికి ఆ దుకాణంలో యాదగిరి వాటాదారుడు.

అదొక పరిశ్రమ అనుకుంటే ఆయనో డైరెక్టర్. కానీ యాద గిరికి డిగ్రీల్లేకపోటంవల్ల అంత హోదా రాలేదు. అది కాస్తా "సారు" చేతికే పరిమితమై యాదగిరి దుకాణంలో కూలీగానే మిగిలిపోయాడు. అయినా యాదగిరి ఆ భావన లేకుండానే దుకాణం తాళాలు తీసిన దగ్గరనుండీ మళ్ళీ రాత్రి పదింటికి మూసేవరకూ అన్నీ తానే... అంతా తానే... కానీ ఏవీ తనవి కావని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

తాము తగలబెడుతున్నదేనాయకుడినో తెలిస్తే... అదో తృప్తి. అందుకే యాదగిరి నాయకుల మాస్కులు సిద్ధంగా ఉంచుతాడు. బొమ్మలకి తగిలించి రేటు పెంచుతాడు. నాయ కుడికి చెప్పులదండ కావాలంటే యాదగిరి సిద్ధం చేస్తాడు. సన్మానాలకి పూలదండల దుకాణాలున్నప్పుడు అవమానా లకి పాత చెప్పుల దండలుంటే తప్పేంటీ? ఈ ఆలోచన యాదగిరి మానసపుత్రిక. వాళ్ళ సారుకి బంగారు బాతు.

***

గల్లీ పిల్లలు ఏరుకొచ్చిన చెప్పులు యాదగిరి కొంటాడు. దుకాణంలో పెడతాడు. సారు వాటికి వెల కడతాడు.

బొమ్మలు కేవలం గడ్డితోనే చేస్తే మజా ఏముందీ! ఆ బొమ్మల మధ్య దీపావళి టపాసులు పెడతాడు. అంతే ఆ నాయకుడు పేలిపోతాడు.

ప్రజలు నాయకుణ్ని చేస్తారు. తర్వాత ఆ నాయకుణ్ణి ఏమీ చేయలేరు. అలా ఏమీ చేయలేని నిరాశా నిస్పృహల్తో ఇదిగో... ఇలా కసి తీర్చుకుంటారు.

ఇది మన స్వేచ్ఛా ప్రజాస్వామిక మంగళ సూత్రం. యాద గిరి వాళ్ళ సారుకి వ్యాపార సూత్రం.

ఆనాడు తన గుడిసెముందు నిలబడి తనతో మాట్లాడిన



ఇంటి వైద్యం

★ పసుపు ఉసిరి చేదు పొట్ల ఆకులను సమంగా గ్రహించి చూర్ణం చేసి మూడు గ్రాములు అల్లం రసం, 20 చుక్కల బొప్పాయి పాలతో కలిపి రెండుసార్లు వాడితే కడుపులో మంట తగ్గుతుంది.

"నిరుద్యోగ డిగ్రీ హోల్డర్" ఈ సారు ముఖంలో ఈమధ్య పూర్తిగా కనపడ్డం లేదు.

తన తల్లి అనారోగ్యంలో ఆదుకుంటాడనుకున్నా... తన పెళ్ళికి సాయం చేస్తాడనుకున్నా... యాదగిరికి నిరాశే ఎదురైంది. లోకానికి మాత్రం "సారు" చాలా సాయం చేసినట్లే. కానీ అది అప్పుగా పెరిగి వడ్డీ గడ్డి మొలిచిందని ఎవరికీ తెలీదు.

⁂

రోజూ ఎన్నో ధర్నాలు... ఎందరో నాయకులు... ఏవేవో సంభాషణలూ... ఇవేవీ తనని ప్రభావితం చేయకుండా ఉద్రేకానికి లోనుకాకుండా దొరికిందే పదివేలనుకుని పది వ్రేళ్ళతో పొదువుకునిపోయే యాదగిరికి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు లేవు.

తాను వింటున్న నాయకుల వాగ్దానాలు తన గుడిసె జీవితాన్ని మార్చలేకపోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ఏ పథకానికీ తాను అర్హుడు కాలేకపోతున్నాడు. అందరు నాయకుల్నీ అందరూ విమర్శిస్తున్నారు. అన్నీ ఆ తానులో ముక్కలే.

"ఎల్లమ్మను ఎంచక్కరలేదు. పోలమ్మను పొగడక్కర లేదు." వాళ్ళ సంగతి అలా ఉండనీ... తన యజమాని సంగతే తనకు అర్థంకాలేదు.

ఈరోజు దుకాణం మూసేటప్పుడు ఆయన ధోరణి తనకేం నచ్చలేదు. రోజూలాగానే తాళాలు వేస్తున్నాడు తాను...

"సరిగా వెయ్‌రా! ఈమధ్య దొంగలు మన దుకాణం చుట్టూ దిరుగుతున్నారు."

"మన దుకాణానికెవడొస్తాడు సారూ! ఏం పట్టుకపోతాడు." అంటూ నవ్వేశాడు యాదగిరి.

"రోజూ పగలు కస్టమర్లుగా ఒట్టేటోల్లే! రాత్రిపూట దొంగల్లై తిరుగుతారు. ఆలంతా మీ గుడిసెలోళ్ళే."

యాదగిరికి గుండె కలుక్కుమంది. గుడిసెలోళ్ళే దొంగలు. ఇస్త్రీ చొక్కాలు దొడిగి చేతికి రాళ్ళ ఉంగరాలు పెట్టుకోని తాను చేస్తున్న దోపిడీకి అదృష్టపు ముసుగు, దైవానుగ్రహపు వ్యాఖ్యానమూ చూస్తుంటే "సారు"ని ఎవరైనా దొంగనగలరా! రకరకాల ఆలోచనతో సైకిలు తొక్కుతూ సాగుతున్నాడు. గుడిసె రావడంతో ఆలోచనలు పక్కకు తప్పుకున్నాయి. తల్లి గట్టిగా దగ్గుతుండడంతో యదార్థంలోకి వచ్చాడు.

"అమ్మకెట్లున్నదే..." భార్యనడిగాడు.

"ఏం బాగులేదు." నాకు భయంగా ఉంది.

తన చేతి సంచిని చుట్టూ చేరిన పిల్లలకిచ్చాడు. రాత్రంతా నిద్రపట్టపోయినా తెల్లారింది.

పిల్లలు గల్లీలో గవర్నమెంటు స్కూలుకి వెళ్తున్నారు. ఏవో చదువులు. పిల్లలు ఫెయిలవుతారు- గవర్నమెంటు ఆసుపత్రిలోనే పెద్ద మార్చురీ ఉంటుంది. గవర్నమెంటు స్కూలు పిల్లలే ఫెయిలవుతుంటారు. తల్లిని ప్రైవేటు దవఖానాకు తీసుకుపోయే స్తోమత తనకు లేదు. గవర్నమెంటు ఆసుపత్రికీ అంటే చావును జీర్ణించుకోడానికి సిద్ధపడడమే. ఆ పనిని తన భార్యకు అప్పగించి తాను కొలువుకు వెళ్ళాడు.

"రా! రా! యాదగిరీ! నీకోసమే చూస్తున్నాం. జల్దీరా! అంటూ దుకాణం ముందు కస్టమర్స్ రెడీ!

సైకిలు ప్రక్కన పెట్టి చాలా మూడీగా వస్తున్న యాదగిరిని చూస్తూ నిలబడ్డాడు సారు. యాదగిరి అతనిని పట్టించుకోలేదు.

"ఏమిరా! యాదగిరీ! బొమ్మలు రెడీనా."

"ఆ. రెడీ!"

నువ్వెన్నాళ్ళనుండీ అదే రకం బొమ్మల ఇస్తున్నావు. కొత్త వెరైటీ ఏమీ లేవా?" అన్నాడు యూనియన్ లీడర్.


"ఆ... నువ్విచ్చే పైసలకి నడిచే బొమ్మలొస్తాయి" అన్నాడు సారు నవ్వుకుంటూ. "మా యాదగిరి తలుచుకుంటే నడిపించేస్తాడు."

⁂

తన శక్తి సామర్థ్యాల మీద సారుకంత విశ్వాసమున్నందుకు యాదగిరి మురిసిపోయాడు.

"ఎంతిస్తాడో! అడగండి సార్. నడిచిన బొమ్మలిస్తే..." అని ఉత్సాహంగా చూస్తూ వాళ్ళకివ్వాల్సినవిచ్చేశాడు.

⁂


ఇన్నాళ్ళూ నడిచే బొమ్మలు చిన్నవి. ఇప్పుడు కాస్తా పెద్దబొమ్మ బాగా గెంతుతుంటే కల్లు మత్తులో లారీలో జనాలకి బాగా కిక్కెక్కింది. బొమ్మ బాగుంది. చాలా బాగా ఆడుతోంది. దీని చేతిలో మరో బొమ్మ. పూర్తిగా గడ్డితో... అది కాల్చడానికి. రెండుబొమ్మలూ బాగా ఊగుతున్నాయి. ఊరేగింపులో...

వాళ్ళు వెళ్ళాక యాదగిరి మనసంతా నడిచే బొమ్మల మీదే ఉంది. ఇంతవరకూ తన కొచ్చిన అనేక రకాల ఆలోచనలని ఆచరణలో పెట్టాడు. తన సారు ఎంతో మెచ్చుకునేవాడు. ఇది మాత్రం తనెందుకు నిజం చేయలేడూ?

⁂

ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళాడు. మర్నాడు వస్తూనే బస్తీలోని నలుగురు పిల్లల్ని తీసుకుని వచ్చాడు.

"వీళ్ళంతా ఎందుకురా! యాదగిరి".

"నడిచే బొమ్మలు సారు. వాళ్ళనే బొమ్మలుగా పంపిస్తా"...

"గొడవొస్తుందేమో."

"ఏం గాదు సారు! గుడిసె పిల్లలు. ఆళ్ళకీ నాలుగు పైసలు దొరుకుతాయి. తిండి దొరుకుతాది.

ఈళ్ళకే గడ్డిచుట్టి మొకాలకి బొమ్మలు పెడతాం. డప్పులు కొడుతుంటే డాన్సులు చేసుకుంటా దుంకుతారు."అని నమ్మకంగా పలికాడు.

"పోలీసోళ్ళతో గొడవేమో. పిల్లల్ని పనిలో పెట్టుకుంటే..." అన్నాడు సారు. సందేహంగా.

"అదేంగాదు సారు. మనమేమైనా పనిచేయించుకుంటున్నామా! వాళ్ళకి నాలుగు పైసలు ఒచ్చేతోవ చూపిస్తన్నాం" అంటూ యాదగిరి పిల్లల్ని అడిగాడు. పిల్లలు ఏక కంఠంగా "వస్తాం" అన్నారు. యాదగిరి ఆలోచన రూపుదిద్దుకుంది. ముఖాలకు రకరకాల మాస్కులు. ఒకడు సీ.ఎమ్. ఒకడు పి.యం. ఒకడు ప్రతిపక్ష నాయకుడు ఇలా- అన్నీ నడిచే బొమ్మలు రడీ!

వినియోగదారులకి కూడా ఈ నడిచే బొమ్మలు వినోదాన్ని పంచుతున్నారు.

దీనిలోనున్న ప్రమాదాల్ని యాదగిరి ఊహించే లోపుగానే పిల్లల తల్లిదండ్రులు యాదగిరి మీద విరుచుకుపడ్డారు. యాదగిరి తానేదో ఉపకారం చేస్తున్నాననుకున్నాడు.

"ఇదిగో యాదగిరీ! మా పిల్లగాల్ని తీస్కుపోయి ఎంత సంపాయించావు?" గంయ్‌మన్నది ఓ తల్లి.

"నా తల్లిమీదొట్టు. అక్కా! నీ పిల్లగానికే పైసలిప్పిచ్చినా!" అన్నాడు యాదగిరి.

వీధిలో అందరూ అలా నిలదీసేసరికీ యాదగిరి తల్లీ, భార్య వచ్చి యాదగిరికి నాలుగు చీవాట్లు పెట్టారు.

యాదగిరి తలవంచాడు. ఇన్నాళ్ళూ తాను చేసిన అనేక ఆలోచనల్లో తను ఓడింది ఈ ఒక్కసారే!

మర్నాడు నీరసంగా కొలువుకు వెళ్ళేసరికీ ధర్నావాళ్ళు అక్కడ నానా యాగీ చేస్తున్నారు. పిల్లలు రాకుండా యాదగిరి ఒక్కడే రావడం చూసి సారు చాలాకోపం చేసాడు. "పిల్లలేర్రా! యాదగిరీ!"

"ఇంక ఆళ్ళెవరూ రారు సారూ!"

రాపోతే ఎలా రా! ఈళ్ళ దగ్గర అడ్వాన్స్ పుచ్చుకున్నా! నడిచిన బొమ్మలిస్తానని."

"ఇదిగో! యాదగిరీ! నువ్వేం చేస్తావో మాకు డెల్వద్, ఓ పది నిమిషాల్లో చౌరస్తా కాడికి ఒక పిల్లోన్నైనా పంపియ్. అన్నదో కటువైన గొంతు, దూరమౌతూ.

"చెప్పురా! చెప్పు! వాళ్ళడుగుతున్నారు.

లేనిపోనివన్నీ అలవాటు చేసినావు. ఇప్పుడీళ్ళతో కొట్లాటొచ్చేటట్లుంది" అన్నాడు సారు.

"ఏదో చేద్దాం లే సారు" అంటూనే తన చూపులు రోడ్డు మీద మనిషికోసం వెతుకుతున్నాయి.

"ఏం చేస్తావ్! నేను బొమ్మవేషంలో పోవాలా?" అరుస్తున్నాడు సారు.

"అంతదాకా వస్తే నేనే పోతాలే సారూ! ఎవరూ దొరక్కపోతే..." అంటూన్నాడు యాదగిరి.

"అయితే జల్దీగా పో! మళ్ళీ వాళ్ళొచ్చేలోగా..."

ఇక తనకి తప్పదనుకున్నాడు యాదగిరి.

⁂

చౌరస్తాలో డప్పులు మ్రోగుతున్నాయి. జిందాబాద్‌లు ముర్దాబాద్‌లు... మైకులో గోల... పెద్ద బొమ్మ నడుచుకుంటూ... చిందులేస్తూ... గుంపులోకి చేరింది.

ఇన్నాళ్ళూ నడిచే బొమ్మలు చిన్నవి. ఇప్పుడు కాస్తా పెద్దబొమ్మ బాగా గెంతుతుంటే కల్లు మత్తులో లారీలో జనాలకి బాగా కిక్కెక్కింది.

బొమ్మ బాగుంది. చాలా బాగా ఆడుతోంది. దీని చేతిలో మరో బొమ్మ. పూర్తిగా గడ్డితో... అది కాల్చడానికి. రెండుబొమ్మలూ బాగా ఊగుతున్నాయి. ఊరేగింపులో...

ఓహో... జనం... లారీల్లో జనం...

పిల్లల్ని ఒద్దన్నాడని మన యాదగిరి ఎవడో పెద్దోణ్ణే అట్టుకచ్చిండు, అని లారీలోంచి ఒక గొంతు. "ఆ యాదగిరి బుద్ధొంచిందిలే" మరొక గొంతు. దిష్టిబొమ్మ తలపైకెత్తి ఆ గొంతుల్ని గుర్తుపట్టింది.

ఎవరి గోలలో వాళ్ళున్నారు. దిష్టిబొమ్మ మీద పెట్రోలు పడింది. క్షణ కాలంలో రెండు బొమ్మలూ బూడిదయ్యాయి. కాకపోతే... ఒకటి అరిచింది- మరొకటి అరవలేదు.

ఎవడో ఆకతాయి తమ వర్గానికి సానుభూతి సంపాదించడానికో శవం కావాలని ఈ పని చేసాడు. కళ్ళ ముందు జరిగిన ఘోరం చూసిన జనం... ఆందోళన- త్రొక్కిసలాట... లాఠీ చార్జీ... సాయంత్రానికి చౌరస్తా సద్దుమణిగింది.



ఇంటి వైద్యం

★ ఉసిరికాయ పిల్లిపీచర గడ్డల చూర్ణంలను మూడుగ్రాములు ఉదయం- సాయంత్రం మజ్జిగత్రక్రముతో గాని లేక కాచి చల్లార్చిన పాలతో గాని ఉదయం- సాయంత్రం సేవిస్తే కడుపులో మంట తగ్గుతుంది.

# నిరంతర కళాసాధన నవ్యాకృతుల సృజన



తెలుసుకోవాలే కానీ..కళాకారులు.. ఇందుకలరందు లేరనే సందేహం ఎంతమాత్రం అవసరం లేదు. పల్లెల్లో..పట్టణాల్లో..వాడ వాడలా కాస్తో కూస్తో కృషితో , ఏదో ఒక కళను ఔపాసన పట్టేందుకు ప్రయత్నించేవారు కనిపిస్తారు. వరంగల్ జిల్లా కేసముద్రం మండల కేంద్రం లోని మహర్షీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న శివకుమార్ ఒకరు.ఇల్లు ఊడ్చి శుభ్రపర్చడానికే పరిమితమైన చీపురు పుల్లలతో అద్భుతమైన కళాకృతులను ఇట్టే రూపొందించి అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నాడు




ఈ బండారు శివకుమార్. శివకుమార్ చిన్న తనం నుండి ఏదో ప్రత్యేకత చూపడం కోసం కష్టపడుతున్నాడు. ఫలితంగా ఆయన చేతిలో పడ్డ చీపురు పుల్లలన్నీ కలిసి ఓ ఆర్ట్‌పీస్‌గా మారుతున్నాయి. ఈఫిల్ టవర్, ఆగ్రాలోని తాజ్‌మహల్, అందమైన ఇల్లు, దేవాలయాల ఇలా ఒకటి అని కాదు..ఏదో ఒకటి చేయడమే పనిగా పెట్టుకున్నాడు.


కేవలం చీపురు పుల్లలతో చేసే ఆకృతులే కాకుండా చిత్రలేఖనంలో అభినివేశం వుంది. మహాత్ముల చిత్రపటాలు, రాజకీయ, సామాజిక వేత్తల చిత్రాలను ఇట్టే వేయడం చిన్నతనం నుంచీ అలవాటు. చూసింది.. చూసినట్టు ఇట్టే పట్టేసి క్షణాల్లో మనముందుంచడంలో దిట్టగా పేరుగాంచాడు.

దీనికితోడు చీపురు పుల్లలో అతిచిన్న ఆకృతులను రూపొందించి గాజు సీసాలు, విద్యుత్ బల్బుల్లో అమర్చడం శివ మరో ప్రత్యేకత. కుక్క పిల్ల.. సబ్బు బిల్ల కాదేదీ కవిత్వానికనర్హం అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుని శివకుమార్ ఎటువంటి వస్తువును వదిలిపెట్టకుండా కళాదృష్టితో చూస్తూ ఏదో ఒక ఆకృతిగా మలచడం అలవాటు చేసుకున్నాడు. తన అద్భుతమైన డ్రాయింగ్‌తో పాటు వస్తువులతో కళాఖండాలు రూపొందించి పలువురి చేత ప్రశంసలందుకుంటున్నాడు. రాబోవు రోజుల్లో ఫైన్ ఆర్ట్‌లో చేరి యానిమేషన్‌లో శిక్షణ పొంది రాష్ట్రస్థాయిలో గుర్తింపుపొందాలనేది అతగాడి లక్ష్యం.

**-బండి సంపత్ కుమార్, కేసముద్రం**








యాదగిరి ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో సారు దుకాణం మూసి ఇంటికెళ్ళాడు. రాత్రి వార్తలు చూస్తూ నిజం తెల్సుకున్నాడు.

"ఏమేవ్... మీ ఆయన గొప్ప తెలివైన పనిచేసిండు.

ఎవడో కూలిపనోణ్ణి నడిచే బొమ్మని చేసిండు. ఆడు కాస్తా కాలిపోయి సచ్చిండు. మీ వోన్ని పోలీసోళ్ళు దీస్కపోతారు..." ఇలా గుడిసెలోళ్ళు తలోమాట. వాళ్ళకెవరికీ చచ్చినబొమ్మ ఎవరో తెలీదు.

సారుకేం చెయ్యాలో అర్థంకాలేదు.

యాదగిరి భార్యకు జరిగిందేంటో అర్థంకాలేదు.

ఉదయం లేచి సారు యాదగిరి గుడిసెకెళ్ళాడు. "యాదగిరి నిన్న కొలువుకెందుకు రాలేదు" సారు ప్రశ్న. "రాలేదా" అంటూ బయటకొచ్చిన యాదగిరి భార్య దిష్టిబొమ్మ అయిపోయింది సారుని చూసి. ఎందుకంటే...

యాదగిరి గత కొన్నాళ్ళుగా ఒక దిష్టిబొమ్మను చేసి యింట్లోనే ఉంచాడు. దాని గూర్చి ఎప్పుడడిగినా కసిగా ఏదో చెప్పేవాడు. దానికీ ఒక మాస్కు తగిలించాడు. అదెవరిదో ఎన్నడూ ఆమెకు చెప్పలేదు.

ఇప్పుడా మాస్కువ్యక్తే తన భర్తకు యజమాని అనే సత్యం తెలిసింది. ఈ క్షణంలో ఇంట్లో ఒక దిష్టిబొమ్మ... వీధిలో ఒక దిష్టిబొమ్మ... మధ్యలో తానొక దిష్టిబొమ్మ."రాత్రి కొలువునుండి ఇంటికి రాలేదయ్యా" అంటూ కంగారు పడడం... గుడిసెల వాళ్ళంతా కంగారుగా తోసుకురావడం... వారి గోలలు, ఓదార్పుల మధ్య అసలు నిజం బయటపడింది

యాదగిరి భార్య సొమ్మసిల్లి పోయింది.

ఈ గందరగోళంలో గుడిసె బయటున్న దిష్టిబొమ్మ చల్లగా జారుకుంది. ఇంట్లో దిష్టిబొమ్మ అలాగే ఉంది. యాదగిరి భార్యకు బస్తీలో ఎన్నో దిష్టిబొమ్మలు కన్పిస్తున్నాయి.

అస్తవ్యస్త వ్యవస్థను చూస్తూ భరిస్తూ ముక్కుమూసుకుంటున్న దిష్టిబొమ్మలు...

రేషన్‌షాపు దగ్గర క్యూల్లో దిష్టిబొమ్మలు...

ప్రభుత్వ ఆఫీస్‌లో పనులకోసం తిరిగే దిష్టిబొమ్మలు...

కోపాన్ని పంటి బిగువుతో పట్టి ఉంచిన దిష్టిబొమ్మలు...

వీటన్నిటికీ కారణం...

ఓటు వెయ్యడానికి డబ్బు తీసుకునే దిష్టిబొమ్మలు...

రాజకీయాలు పాడైపోయాయంటూన్న మేధావి దిష్టిబొమ్మలు...

తానొక దిష్టిబొమ్మ కాదల్చుకోలేదు ఆమె.

తన భర్త ఇంట్లో చేసి ఉంచిన దిష్టిబొమ్మ. తన భర్త రాసిన వీలునామాగా... అదే అతని మరణ వాఙ్మూలంగా మలుచుకున్నది. జీవితంలో తనకు జరిగిన నష్టానికి పరిహారాన్ని సాధించుకుంది. ★

**రచయిత చిరునామా:**
**మావుదూరు సూర్యనారాయణమూర్తి,**
**ఇం.నెం.10-5-778/ఏ/బి, సాయినగర్,**
**తుకారాంగేట్, నార్తలాలాగూడ, సికింద్రాబాద్- 500 017.**



★ శొంఠి, సోంపు, ధనియాలు, మిరియాలు, జీలకర్ర, పిప్పళీ, వాము మొదలైనవి చూర్ణంచేసి మూడు గ్రాములు ఉదయం- సాయంత్రం భోజనానికి ముందు సేవిస్తే ఆకలి పుడుతుంది.